పురస్కారం ప్రదానం

మల్లాపూర్: మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ సురేష్ కుమార్ మిశ్రాకు మైత్రేయ సమ్మాన్ పురస్కారం లభించింది. భోపాల్‌లోని మిత్తల్ గ్రూప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎడూజీ లైఫ్ సంస్థ ప్రదానం చేసిన ప్రతిష్టాత్మకమైన మేత్రేయ సమ్మాన్ పురస్కారాన్ని మధ్యప్రదేశ్ మహిళా శిశు సంక్షేమ మంత్రి నిర్మిలా భూరియా చేతుల మీదుగా రూ.21 వేల నగదుతో పాటు పురస్కారం అందుకున్నారు. 2021లో కూడా తెలంగాణ హిందీ అకాడమీ శ్రేష్ట నవయువ రచనాకార్ సమ్మాన్‌ను కేసీఆర్ చేతుల మీదుగా అందు కున్నారు.

బ్లూ క్రాస్ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాక్సినేషన్


వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్

మేడిపల్లి: వరల్డ్ రేబిస్ డే సందర్భంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో శనివారం పీర్జాదీగూడ నగర పాలక సంస్థ పరిధిలోని డెకాత్లన్ వద్ద దాదాపు 258 వీధి, పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. పీర్జాదీగూడ మేయర్ అమర్‌సింగ్, కార్పొరేటర్లు బండి రమ్య, కుర్ర శాలిని సరిత, కోడే పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ బాలమురళీకృష్ణ, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గౌతంనగర్: వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని మల్కాజిగిరి ట్రాఫిక్ ఎస్సై సూర్య అన్నారు. గౌతంనగర్ లిల్లీ మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఐసీఐసీఐ లాంబార్డ్ సౌజన్యంతో 250 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. రాజేష్, లిల్లీ మోడల్ స్కూల్ నిర్వాహకులు షేక్ సయ్యద్ అహ్మద్, షేక్ హజ్రమతిన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణమాసం

మల్లాపూర్: మల్లాపూర్ జేఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయంలో ఉన్న అంగన్‌వాడీ పాఠశాలలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా మల్లాపూర్ ఆసుపత్రి ఏఎన్‌ఎం వెంకటమ్మ హాజరై అవగాహన కల్పించారు. పిల్లల ఎత్తు, బరువు వయస్సు తగ్గట్టుగా ఉండాలన్నారు. అంగన్‌వాడీలో ఇచ్చే బాలామృతం పిల్లలకు తినిపించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ వాణీ, ఆశావర్కర్లు అరుణ, స్వప్న,పావనీ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అధికారులతో చిరు వ్యాపారుల వాగ్వివాదం


కుషాయిగూడ మార్కెట్ వద్ద..

కుషాయిగూడ: కాప్రా సర్కిల్, చర్లపల్లి డివిజన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపజేశారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రిపురం చౌరస్తా వరకు ప్రధాన రోడ్డు వెంట ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించే క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద వ్యాపారులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఇకముందు ఫుట్‌పాత్‌ల ఆక్రమణను ఉపేక్షించేది లేదని, ఆక్రమదారులపై కఠినంగా వ్యవహరిస్తామని కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్ హెచ్చరించారు.

స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం



బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్‌లో ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులను అరికట్టేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యల గురించి ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, హెల్త్ అసిస్టెంట్ వినోద్, స్వచ్ఛ భారత్ కో- ఆర్డినేటర్లు మల్లేష్, మహేందర్, వార్డు ఆఫీసర్ ఏర్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి


బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కాప్రా: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ పద్మశాలి టౌన్‌షిప్ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు నిలిచి ఉంటుందన్నారు. పద్మశాలి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చిట్టి మిల్లగణేష్, ప్రధాన కార్యదర్శి ఎర్ర మాదవ హరినారాయణ, ఉపాధ్యక్షులు బోనకుర్తి అర్జున్, బొద్దుల వెంకటగిరి ప్రసాద్, సబ్బం రామకృష్ణ, కటకం శ్రీనివాస్, నాగేశ్వరరావు, బొమ్మ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం



హబ్సిగూడ: తెలంగాణ రాష్ట్ర నూతన పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం హబ్సిగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్ రెడ్డి, తవిడబోయిన గిరిబాబు తదితరులున్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

- టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వినోద్‌కుమార్, కురుమూర్తి


టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు విడదీసి పాలన చేసిందని, ఇప్పటికీ కొన్ని కొత్త సంఘాలు పుట్టుకొచ్చి, ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టించే పనిచేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం నగర శివారులో ఏర్పాటు చేసిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇందులో నూతన జిల్లా కమిటీ ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టిందని, హెల్త్ కార్డుల విషయాన్ని తేల్చలేదన్నారు. పీఆర్సీ లేవని విమర్శించారు. ఉద్యోగులకు గజం జాగా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మనం కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, ఉద్యోగుల ఐక్య కార్యాచరణతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. టీజీవో అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా జిల్లాలలో సమావేశాలు, ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ... అసోసియేషన్‌ను బలోపేతానికే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. 2023లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వివిధ శాఖల అధికారుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నారు. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, నూతన జిల్లా కమిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బి.వినోద్ కుమార్, కార్యదర్శిగా పశు సంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 మందితో అసోసియేషన్ నూతన కమిటీని సమావేశం ఎన్నుకుంది. ఇందులో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కె. వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా ఐ.విజయకుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా విష్ణు వర్ధన్ రావు (ఎఫ్‌ఆర్‌వో), ఎం.అర్చన, ఆర్‌ఎంవీ ఆనంద రావు, ట్రెజరర్‌గా డి.కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.హెచ్.రమేష్, పబ్లిసిటీ సెక్రటరీగా డాక్టర్ ఇ.సత్యనారాయణ, ఆఫీసు సెక్రటరీగా ఎస్.సాయికృష్ణ, కల్చరల్ సెక్రటరీ గా బి.నాగమణి, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ శ్యామల, హెచ్.నాయుడు, డాక్టర్ ఎస్.స్వాతి, పి.డాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాల

ఉపాధ్యాయుల కొరతతో ప్రారంభంకాని పాఠ్యాంశాలు



ఉప్పల్: చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నారు. సరైన టాయిలెట్స్ వసతి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు నేరుగా విద్యార్థులే ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న స్థానిక బీజేపీ నేత గోనే శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శనివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రతతో పాటు 600 విద్యార్థులకు కేవలం మూడు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయని, గతేడాది నుంచి ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని విద్యార్థులు తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆంగ్లం, సైన్స్, బయాలజీ తదితర సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక ఇంకా పాఠాలు ప్రారంభించలేదని వాపోయారు. ఈ సందర్భంగా గోనే శ్రీకాంత్ మాట్లాడుతూ.. 2017లో పదోతరగతి వరకు పాఠశాలను అప్‌గ్రేడ్ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో ఉత్తీర్ణత శాతం పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డిని వివరణ కోరగా.. ఉపాధ్యాయుల కొరత ఉందని బైఫరికేషన్ తర్వాత ఉపాధ్యాయులు కేటాయించలేదన్నారు.

కార్పొరేటర్ పర్యటన


కొత్త చెరువులో వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ జానకీనగర్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. శనివారం కాలనీలోని పార్కులో పెండింగ్‌లో ఉన్న సీవరేజ్ లైన్ ఫ్లోరింగ్ గురించి కాలనీవాసులతో చర్చించారు. అనంతరం చిన్నరాయుని చెరువు నుంచి చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. గిరి, సాజిద్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: నాచారం ఇందిరానగర్, రాఘవేంద్ర నగర్ కాలనీలో శనివారం అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి జాన్సన్ గ్రామర్ హైస్కూల్ ఏరియా, రాఘవేంద్రనగర్‌లో పలు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సంబంధింత అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. మన్‌సూన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి మట్టి, ఇసుక పూడికతీతను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక నేతలు ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, సత్తయ్య, మహేష్ , రాగూర్ కిషన్‌నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

వాన.. హైరానా !

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో కురిసిన భారి వర్షానికి కాలనీలు, బస్తీలు అతలాకుతలమయ్యాయి. భారీ వరదతో కాలనీల్లోని రోడ్లను కమ్మేసింది. దీంతో కాలనీలు, బస్తీవాసులు కంటి మీద కునుకులేకుండా రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. ఉప్పల్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రాత్రంగా వరదనీరు కాలనీల్లోకి వచ్చి చేరిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వరద తర్వాత రోడ్డంతా బురద పేరుకు పోవడంతో ఇంట్లో నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. చిలుకానగర్ డివిజన్ పరిధి కుమ్మరి కుంట, మర్రి చెట్టు, ఆదర్శనగర్ రోడ్డు నెంబర్ 11 చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో వరద వచ్చి చిలుకానగర్ బస్తీలను ముంచెత్తింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురైనట్లు తెలిపారు.

ఇళ్లలోకి చేరిన వరద నీరు..

కుషాయిగూడ: కుషాయిగూడ, ఈసీఐఎల్ ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపై వరదనీరు ఏరులై పారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన సాయినగర్, కృష్ణారెడ్డినగర్, సోనీయాగాంధీనగర్ కాలనీల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. వరద ప్రవాహంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

వర్షానికి కాలనీలు జలమయం

రామంతాపూర్ : భారీ వర్షం కారణంగా పలు కాలనీలు, బస్తీలు రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాత్రి కురిసిన వర్షంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనగా.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


సాయినగర్ వైండింగ్ షాపులో ఇలా..


రామంతాపూర్ నెహ్రూనగర్‌లో..

ఉప్పల్‌లో ఖోఖో టోర్నమెంట్

ఉప్పల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అన్ని స్థాయిల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈవో రామారావు తెలిపారు. ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన జోనల్ స్థాయి ఖోఖో టోర్నమెంట్‌ను ప్రధానోపాధ్యాయులు వందనపు వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రావీణ్యాన్ని సంపాదించుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ రంగాల్లో ఉన్న అధికారులంతా దాదాపుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్న వారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. క్రమశిక్షణ, ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని సూచించారు.

కాసం మహిపాల్‌రెడ్డి నివాసానికి హరీష్‌రావు



కాప్రా: బీఆర్‌ఎస్ పార్టీ ఏఎస్‌రావునగర్ డివిజన్ సీనియర్ నేత కాసం మహిపాల్ రెడ్డి నివాసానికి మాజీమంత్రి హరీష్‌రావు వెళ్లారు. ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాసం ఇంటికి వెళ్లిన హరీష్‌రావుకు కుటుంబసభ్యులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు , మాజీ కార్పొరేటర్ రామారావు, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెట్ మీట్‌కు ఎంపిక

ఉప్పల్: ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న 10 వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెట్‌మీట్‌లో ట్రై అథ్లెట్ పోటీల్లో 2088 పాయింట్లు సాధించిన ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థిని కె. సాయిశ్రీ గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ ఫసాలా తెలిపారు.

రూ.77 లక్షలతో అభివృద్ధి పనులు

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రామంతాపూర్ రామ్‌శంకర్‌నగర్‌లో రూ.77 లక్షలతో చేపట్టే సీసీరోడ్లు, వరదనీటి కాలువ పనులను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ.. రామంతాపూర్ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సమస్య నెలకొందని, గత 30 ఏళ్ల క్రితం అప్పటి జనాభా ప్రాతిపదికన వేసిన పైపులైన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డివిజన్‌లో కొత్తగా డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా తోడ్పటును అందించాలని కార్పొరేటర్ ఎమ్మెల్యేను కోరారు. జీహెచ్‌ఎంసీ డీఈ నాగమణి, ఏఈ శ్వేతశ్రీతో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు స్థానికులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ


వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నట్లు విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఘట్‌కేసర్, మేడిపల్లి మండల 68వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యాజ్యోతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2,500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించారు. వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో విద్యాజ్యోతి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి ప్రథమ బహుమతి గెలుసుకున్నట్లు వివరించారు. ఆటలు ఆడటం వల్ల ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ప్రిన్సిపాల్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి పదవులు


డీసీసీ నేత హరివర్ధన్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి భవిష్యత్తులో మంచి పదవులు వస్తాయని మేడ్చల్ జిల్లా డీసీసీ నేత సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నాచారం డివిజన్ కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన విషయాలపై చర్చించారు. కాగా పార్టీలో సీనియర్లకు తగిన ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారం శ్రీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వంట పాత్రల విరాళం

అల్వాల్: కౌకూర్ ప్రభుత్వ పాఠశాలకు సుమారు రూ.40 వేల విలువైన వంట పాత్రలను కొల్గేట్ కంపెనీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి ఇమ్రాన్ మాట్లాడుతూ.. రుచికరమైన వంటకోసం వంట పాత్రలను సక్రమమైన పద్ధతిలో వాడుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, కంపెనీ ప్రతినిధి ఇమ్రాన్, హెల్పర్లు జయమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు సంగీత, భారతి, శ్రీదేవి, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్

కుషాయిగూడ: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ జిల్లా చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ సూచించారు.

ఈ నెల 28న కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్ పోస్టర్‌ను శనివారం ఆయన జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.రవీందర్, మూడో అదనపు జడ్జ్ చిరాగ్ మెహతాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను సంప్రదించాలన్నారు. సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ, భూవివాద తదితర కేసులు పరిష్కరించబడతాయన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

మౌలాలి: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శనివారం వినాయక్‌నగర్ డివిజన్‌లో వినాయక్‌నగర్ బీజేపీ సభ్యత్వ నమోదులో స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. 1980లో జనసంఘ్‌గా ఏర్పడిన బీజేపీ పార్టీ ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి చీకటి రాజ్యానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని చెప్పి అందరూ.. ఏకమై జనతా పార్టీ రూపంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడారన్నారు. ఆ తర్వాత బీజేపీగా ఎదిగి ఈ దేశానికి మొట్ట మొదటిసారిగా వాజ్‌పేయి ప్రధానమంత్రి అయ్యారన్నారు. 2014లో మోదీ ప్రధానమంత్రి అయిన విషయం అందరికి తెలిసిందేనని పేర్కొన్నారు. మోదీ హయాంలో దేశ ప్రతిష్టను ప్రపంచ చిత్రపటంపై పెట్టడాన్ని ప్రజలు చూస్తున్నారని గుర్తు చేశారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి వరుసగా మూడోసారి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత మోదీనేనని అన్నారు. డివిజన్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్, వీకే. మహేష్, మాజీ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, ఉమామహేశ్వరి, మాజీ కౌన్సిలర్ ఆనంద్ గౌలికర్, నరసింహగౌడ్, వాసంశెట్టి శ్రీనివాస్, డీఎస్. వెంకటేష్, మల్లేష్‌యాదవ్, సాయి, సురేష్, శ్రీకాంత్, జగదీష్‌చారి, సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వానికి మద్దతివ్వండి..

మల్కాజిగిరి: బీజేపీ పార్టీ సభ్యత్వానికి ప్రజలు మద్దతివ్వాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. శనివారం మల్కాజిగిరి డివిజన్ శివపురి కాలనీలో పార్టీ సీనియర్ నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశ ప్రతిష్ట ప్రపంచ స్థాయిలో పెరిగిందని, మొన్న జరిగిన ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ వచ్చి ఉంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారన్నారు. పార్టీ సభ్యత్వం అంటే మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లడానికి మోదీకి బలం చేకూరినట్లేనన్నారు. నియోజకవర్గ కన్వీనర్ డీఎస్ వెంకటేష్, పార్టీ నాయకులు సంతోష్, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.


డిజిటల్ సభ్యత్వ నమోదులో ..


నేరేడ్‌మెట్‌లో..

బీజేపీ సభ్యత్వంతో భవిష్యత్తుకు నాంది..

అల్వాల్: బీజేపీ సభ్యత్వం తీసుకుని దేశ భవిష్యత్తుకు నాంది పలకాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. నేరేడ్‌మెట్ చౌరస్తాలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. నాయకులు వెంకటేష్, రమారెడ్డి, మగేష్, సుధాకర్, దినేష్, పర్వతాలు, పవన్, ఇంద్రమ్మ, శర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.